నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: సంజీవయ్యపార్కు, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బేగంపేట కామత్ లింగాపూర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాష్‌నగర్ వాటర్‌వర్క్స్ కార్యాలయం, మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు ఇంటర్‌గ్రాఫ్ భవనం ప్రాంతాల్లో విద్యుత్ ఆపివేస్తామన్నారు.

మెస్ బకాయిలను మాఫీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ హాస్టల్ విద్యార్థుల మెస్ బకాయిలను మాఫీ చేయాలని టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హాస్టల్ మెస్‌లో తిన్నా.. తినకున్నా నెలకు రూ.4000 నుంచి రూ.6000 వరకు బిల్లు వస్తుండటంతో ఆర్థిక భారం పడుతోందన్నారు. క్యాంపస్‌లోని వివిధ కాలేజీల్లో పీజీలు, పీహెచ్‌డీలు పూర్తి చేసిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ విడుదల కానుందు హాస్టల్ మెస్ బకాయిలు లక్షల రూపయాల్లో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులందరూ ఆర్థిక స్తోమత లేనందున బకాయిలను చెల్లించలేక పోతున్నారని వివరించారు. గత ప్రభుత్వం ఓయూ విద్యార్థుల మెస్ బకాయిల కోసం రూ.7 కోట్ల నిధులను విడుదల చేసిందని, ఓయూ పీజీ, పీహెచ్‌డీ కోర్సుల విద్యార్థుల మెస్ బకాయిల మాఫీ కోసం రూ.10 కోట్లను మంజూరు చేయాలని కోరారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

చిలకలగూడ: నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని చిలకలగూడ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని ఓ ఇంట్లో నిత్యం జూదం జరుగుతున్నట్లు ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో ఆదివారం రాత్రి జూదగృహంపై దాడిచేసి చిలకలగూడ, భోలక్‌పూర్, ఓల్డ్ సఫిల్‌గూడలకు చెందిన ప్రకాశ్, సతీష్, విజయ్‌ఓజా, సుందర్, గోపీకృష్ణ, రాజు, శ్రీధర్‌రెడ్డిలను అందుపులోకి తీసుకొని రూ. 7,350 నగదు స్వాధీనం చేసుకుని చిలకలగూడ ఠాణాలో అప్పగించారు.

యువతి ఆత్మహత్య

బౌద్ధనగర్: ఉరేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన మేరకు.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం అయ్యగారిపల్లెకు చెందిన ఎస్. సంధ్య(22) ఎంపిహెచ్‌డబ్ల్యూ పూర్తి చేసి మూడేళ్ల క్రితం అమీర్‌పేట్‌కు వచ్చింది. స్థానికంగా హాస్టల్‌లో ఉంటూ నాలుగు నెలల పాటు కాల్ సెంటర్‌లో ఉద్యోగం చేసింది. అక్కడ ఉద్యోగం మానేసిన సంధ్య ఇటీవల పార్శిగుట్టలోని న్యూ అశోక్ నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని గాంధీనగర్‌లో హోమ్‌కార్‌లో పని చేస్తుంది. అయితే, ప్రతీరోజు సంధ్యకు తన తండ్రి ఫోన్ చేసి మాట్లాడేవాడు. ఈ నెల 2న కూడా సంధ్యకు తన తండ్రి ఫోన్ చేయగా ఆమె లిఫ్ట్ చేయలేదు. ఎన్నిసార్లు చేసినా కూతురు స్పందించకపోవడంతో తల్లిదండ్రులు సోమవారం సంధ్య నివాసముంటున్న ఇంటికి వచ్చారు. లోపలి నుంచి గడియ పెట్టి ఉండడంతో తలుపులు బద్దలుగొట్టి లోపలికి వెళ్లి చూడగా సంధ్య సీలింగ్ హుక్‌కు ఉరేసున్నట్లు గమనించారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న వారాసిగూడ పోలీసులు మృతురాలి తండ్రి చలపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోగి లేకుండా.. సైరన్ మోగిస్తే ఊరుకోం..



బంజారాహిల్స్: చాలామంది అంబులెన్స్ డ్రైవర్లు రోగి లేకుండానే సైరన్ మోగిస్తూ అతి వేగంగా రెడ్ సిగ్నల్ పడిన తర్వాత కూడా దూసుకుపోతున్నారు. పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా ఆధ్వర్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అంబులెన్స్‌లో రోగి లేకుండానే సైరన్లు మోగిస్తూ అతి వేగంగా దూసుకెళ్తుండగా వారిని గుర్తించి పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో అంబులెన్స్ డ్రైవర్లకు ఏసీపీ హరిప్రసాద్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అత్యవసర సమయాల్లో మాత్రమే సైరన్‌లు మోగించుకుంటూ వెళ్లాలని, రోగి లేనప్పుడు కూడా సైరన్లు మోగించుకుంటూ వెళ్లడం వల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రోగి ఉన్నప్పుడు మాత్రమే అంబులెన్స్‌లు రెడ్ సిగ్నల్ పడ్డా వెళ్లవచ్చని, తామే ట్రాఫిక్ క్లియర్ చేస్తుంటామని తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

జెక్‌కాలనీలో మహిళలు-మహారాణులు





జెక్‌కాలనీ మహిళలు-మహారాణుల కార్యక్రమంలో మహిళలు..

సనత్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'జెక్‌కాలనీ మహిళలు-మహారాణుల' కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా జరిగింది. కాలనీ స్ట్రీట్‌నెంబర్-1లోని విజయ గ్రాండ్ డియర్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పలు వినోద కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. అలాగే కాంప్లిమెంటరీ తంబోలా, లక్కీడిప్, సిల్వర్ తంబోలా వంటి ఆటలతో సందడి చేశారు. ఇంకొందరు గానామృతంతో మైమరిపించారు. ఈ సందర్భంగా ప్రతిభకనబర్చిన వారికి అవార్డులు అందజేశారు. ప్రభాఅనంతరెడ్డి, ఎస్.అన్నపూర్ణ, భాగ్యలత మల్లారెడ్డి, కృష్ణకుమారి శారద, అమరావతి, హైమావతి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడండి



బేగంపేట మాతాజీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి

సనత్‌నగర్: మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని మాతాజీనగర్‌లో లోప్రెషర్ సమస్య, కలుషిత నీటి సరఫరా జరుగుతుందన్న ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం ఆమె వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా నీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ రామేశ్వర్, నాయకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వైట్ బోర్డులు అందజేత



వైట్ బోర్డులను అందజేస్తున్న విశ్వ మానవ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సనత్‌నగర్: జెక్‌కాలనీకి చెందిన విశ్వ మానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఏడు వైట్ బోర్డులను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పెసల మస్తాన్‌రావు మాట్లాడుతూ ఏ వ్యక్తి ఎదగాలన్నా, మంచి పేరు తెచ్చుకోవాలన్నా మంచి బుద్ధి, జ్ఞానం, మంచి నడవడిక అవసరమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఎస్‌వై.వెంకటేశ్వర్లు, ముఖ్య కార్యదర్శి ఆంజనేయులు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ సోమవారం బౌద్ధనగర్ కమ్యూనిటీహాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని దాదాపు కోటి 79 లక్షల రూపాయల విలువజేసే 179 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కార్పొరేటర్లు, అధికారులతో కలిసి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ పేదలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లు వర ప్రసాదంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, రాసూరి సునీత, తహసీల్దార్ ప్రతాప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్‌గా శ్రీనివాసులు



ఎస్ ఎల్ శ్రీనివాసులు గౌడ్

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఎస్ ఎల్ శ్రీనివాసులు గౌడ్ తెలంగాణ ప్రభుత్వం ద్వారా హైకోర్టులో ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఈయన ఈ పదవిలో మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం తార్నాక, లాలాపేట ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు గౌడ్ గత ముప్పై సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పార్టీకి సేవలందించారు. న్యాయవాదిగా ఉంటూనే కాంగ్రెస్ పార్టీకి లీగల్ వ్యవహారాల్లో ఆయన అందించిన సేవలను గుర్తించి రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది.

కంపెనీని పునఃప్రారంభించాలి

లాలాపేట: మూతపడ్డ హైదరాబాద్ కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ కంపెనీని పునఃప్రారంభించాలని ఆ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం మౌలాలీ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఆ కంపెనీని యూనియన్ నాయకులు వెళ్లి పరిశీలించారు. అనంతరం జయశంకర్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ అధ్యక్షులు వి. మురళీ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎం. జాన్ తదితరులు మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో ప్రధానంగా వ్యవసాయానికి ఉపయోగపడే ఎరువులు, సల్ఫ్యూరిక్ యాసిడ్, సల్ఫర్ పాస్ఫేట్, ఫెర్టిలైజర్స్ మిక్సర్, నత్రజనీ, హైడ్రోక్లోరిక్ యాసిడ్, మెగ్నీషియం సల్ఫేట్ వంటి ఉత్పత్తులను అందించిన కంపెనీగా ఎంతో పేరుందన్నారు. లాభాల్లో ఉన్న కంపెనీని ఏపి స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ జాయింట్ వెంచర్‌గా తీసుకున్నారన్నారు. కానీ ఆగ్రో ఇండస్ట్రీస్ నిర్లక్ష్యంతో 30 ఏళ్ల క్రితం కంపెనీని మూసి వేశారన్నారు. సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్తయ్య, జాయింట్ సెక్రటరీ మల్లేష్, జాకబ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న కంపెనీ యూనియన్ నాయకులు

ఓయూలో పీహెచ్‌డీ విద్యార్థుల ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ విద్యార్థులకు పరిశోధనలు పూర్తి చేసుకునేందుకు మరో ఏడాది పాటు గడువు పొడిగించాలని ఆర్ట్స్ కాలేజీ వద్ద, పాలన భవనం ఎదుట సోమవారం పీహెచ్‌డీ అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. ఓయూలో 2018లో ప్రవేశం పొందిన విద్యార్థులు కరోన కారణంగా సకాలంలో పీహెచ్‌డీ పూర్తి చేయలేకపోయారని తెలిపారు. ఆర్థిక పరిస్థితితులు ఇతర కారణాల వలన పీహెచ్‌డీ విద్యార్థులు పరిశోధనలు పూర్తి చేయలేకపోయరని వివరించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకొని ఏడాది కాలం గడువును పొడిగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆర్‌ఎల్ మూర్తి, ప్రవీణ్‌కుమార్, రవి, చందు, అరుణ్, రాజేష్, వెంకన్న, క్రాంతి, రవీందర్, నరేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టాలి

• ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్..

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం నూతన భవన నిర్మాణం చేపట్టాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మేడ్చెల్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ద్వారా ఆయన లేఖను పంపారు. సనత్‌నగర్‌లోని రౌండ్‌టేబుల్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఇటీవల స్థానిక కార్పొరేటర్, అధికారులతో కలిసి రౌండ్‌టేబుల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులు, స్కూల్ సిబ్బందితో మాట్లాడారు. తరగతి గదుల కొరత కారణంగా విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారని, తరగతి కార్పొరేటర్‌తో పాటు ప్రధాపాధ్యాయుడు బ్రహ్మచారిలు వివరించారు. సమస్య పరిష్కారం కోసం రౌండ్‌టేబుల్ స్కూల్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ హెల్త్ సెంటర్‌లో నూతన ప్రైమరీ స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా పబ్లిక్ హెల్త్ సెంటర్ స్థలంలో స్కూల్ బిల్డింగ్ నిర్మాణం కోసం అనుమతించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కోరుతూ ఒక లేఖ పంపారు.

ద్విచక్ర వాహనాలు మాయం

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం రహమత్ నగర్ నివాసి జి.మహేష్ ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. తన స్నేహితురాలైన ఒక కానిస్టేబుల్ వద్ద నుంచి ద్విచక్ర వాహనం తీసుకుని విధులకు వెళ్లి వస్తుంటాడు. ఆదివారం విధులకు వెళ్లి రాత్రి తిరిగి వచ్చి ఇంటి ఎదుట వాహనాన్ని పార్క్ చేశాడు. సోమవారం ఉదయం కనిపించలేదు. ఇదిలా ఉండగా.. వెంగళరావునగర్‌లో నివసించే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జయప్రకాశ్‌రావు శనివారం తన ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్లి వచ్చి ఇంటి పక్కన వాహనాన్ని పార్క్ చేశాడు. మరుసటి రోజు ఆదివారం ఉదయం కనిపించలేదు. దీంతో బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

ఇంటర్ పరీక్షలకు 10 నిమిషాల సడలింపు ఇవ్వండి

• బీసీ నేత జాజుల లింగంగౌడ్ వినతి



ఇంటర్ బోర్డు కార్యదర్శి వినతి పత్రం అందజేస్తున్నబీసీ నేత జాజుల లింగంగౌడ్.

ఉస్మానియా యూనివర్సిటీ: రేపటి నుంచి (5న) ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో 10 నిమిషాల పాటు సడలింపు ఇవ్వాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రీకృష్ణ ఆదిత్యకు వినతి పత్రం సమర్పించారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆధ్వర్యంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఒక్క నిమిషం నిబంధన పై ఇంటర్ బోర్డు కార్యదర్శిని సంప్రదించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించమనే నిబంధన వల్ల వందలాది మంది విద్యార్థులు నష్టపోతారని కార్యదర్శికి వివరించినట్లు లింగంగౌడ్ తెలిపారు. ఎంసెట్, లాసెట్, ఎడ్‌సెట్ తదితర ప్రవేశ పరీక్షలకు, ఉద్యోగాల రాత పరీక్షలకు విధించే నిబంధనలు అకాడమిక్ వార్షిక పరీక్షలకు విధించడం తగదన్నారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బూర శ్రీనివాస్, బండి నరేష్, చంద్ర మోహన్ రాయ్, గోదా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో అధ్యాపకులకు వర్క్‌షాప్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొ.బాలకిష్టారెడ్డి, తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు యూజీసీ న్యాక్ గుర్తింపు కోసం అధ్యాపకులకు మూడు రోజుల వర్క్‌షాప్‌ను రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.బాల కిష్టారెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సోమవారం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షత వహించగా ప్రొ.బాల కిష్టారెడ్డి వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. అధ్యాపకులకు అవగాహన కోసం వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు వీసీ ప్రొ.కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్‌వీఐటీ కళాశాలలో టెక్ ఫెస్ట్



రాంగోపాల్‌పేట్: ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో సోమవారం టెక్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. 'టెక్నో ఉద్భవ్-25' పేరుతో ఆదివారం, సోమవారం రెండు రోజులుగా జరుగుతున్న వార్షిక సాంకేతిక కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నాగేంద్ర కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ నుండి మోహన్, ప్రో ఆర్చ్ నుండి శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా ఎస్‌వీఐటీ కరెస్పాండెంట్ పి.ఎల్. శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హ్యాకథాన్, ఇ-స్పోర్ట్స్, కోడ్ మారథాన్ వంటి వివిధ డొమైన్‌లతో ప్రారంభమైంది.

డాక్టర్ గాయత్రిదేవీకి రుషీపీఠం పురస్కారం



డాక్టర్ గాయత్రిదేవిని సత్కరిస్తున్న నిర్వాహకులు

బన్సీలాల్‌పేట్: రుషీపీఠం చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో సోమవారం పద్మారావునగర్‌లోని కౌతాకామకోటి కళ్యాణ నిలయంలో రుషీపీఠం పురస్కార ప్రదానోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. భారత దేశంలో సనాతన ధర్మాన్ని, ఔన్నత్యాన్ని పరిరక్షించుకోవడం భావి తరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్య విధానం అత్యంత పురాతమైనదని చెప్పారు. రుషీపీఠం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బ్రహ్మశ్రీ డాక్టర్ సామవేదం షణ్ముఖ శర్మ మాట్లాడుతూ 1999లో ఏర్పాటైన రుషీపీఠం ద్వారా ఆధ్యాత్మిక ధార్మిక, సాంస్కృతిక, సాహిత్య, సేవా రంగాలలో సేవలు అందిస్తున్న వారిని గుర్తించి పురస్కారాలను ప్రతి ఏటా అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ వీవీఎస్ రామశాస్త్రి, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. విద్యానాథ్, రుషిపీఠం ట్రస్టీ మారేపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక వద్ద మౌలిక వసతులు కల్పిస్తాం

• ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: మారేడుపల్లిలోని హిందూ శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. హిందూ శ్మశాన వాటిక డెవలప్‌మెంట్ సొసైటీ అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే శ్రీగణేశ్ సొంత నిధులతో షెడ్డు నిర్మించారు. సోమవారం సొసైటీ సభ్యులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశాన వాటికల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తరపున కూడా ప్రత్యేక నిధులు దక్కేలా చూస్తానన్నారు. శ్మశాన వాటిక కేర్ టేకర్ సదానంద్, సొసైట ప్రెసిడెంట్ వెంకటస్వామి, సభ్యులు లక్ష్మణ్, చిట్టిబాబు, రఘురాం, నర్సింగ్, వేణుగోపాల్, సత్యనారాయణ తదితరులున్నారు.

యూనివర్సిటీలపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం తగదు



ఓయూలో మాట్లాడుతున్న మహేష్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రాల విశ్వవిద్యాలయాల పై కేంద్ర ప్రభుత్వం పెత్తనం తగదని పీడీఎస్‌యూ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వర్సిటీ స్వయం ప్రతిపత్తిని హరించే యూజీసీ నూతన నిబంధనల ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎన్‌ఈపీ-2020 అమలు చేయబోమని తీర్మానం చేయాలని కోరారు. వర్సిటీల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, బడ్జెట్‌లో విద్యా రంగానికి 20 శాతం నిధులను కేటాయించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జాతీయ నాయకులు మహేష్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీ శ్రీకాంత్, పి.నాగరాజు, నగర కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు గౌతం, సమాయ కార్యదర్శి ఆసిఫ్ పాల్గొన్నారు.

9న తెలంగాణ ప్రాంత మహాసభ

బౌద్ధనగర్: ఈ నెల 9న నిర్వహించనున్న అఖిల భారత 8వ తెలంగాణ ప్రాంత మహాసభను జయప్రదం చేయాలని సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. సోమవారం పార్శిగుట్ట సంజీవపురంలోని పద్మశాలి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. మహాసభకు దేశ, విదేశాల నుంచి పద్మశాలీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చెక్క దేవదాసు, కత్తుల సుదర్శన్, కలపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

నాణ్యత లోపిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు



పైపులైన్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దేదీప్య విజయ్

వెంగళరావునగర్: ప్రజాధనం వృథా కాకుండా ప్రతి పనిని బాధ్యతగా పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ మసీదు గడ్డ ప్రాంతంలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిలో నాణ్యత లోపించకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడైనా నాణ్యత లోపించినట్లు తెలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు, మహమూద్, అబ్బాస్, రషీద్, షానావాజ్, సమద్, ఇమ్రాన్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.